నేడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాక

ఆర్మూర్‌రూరల్, జనవరి 3: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి రానున్నారు. ఉదయం 10.30గంటలకు జక్రాన్‌పల్లిలోని లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం లింబాద్రిగుట్ట దేవునితోట వద్ద కల్యాణ మండపాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం అంకాపూర్‌లోని లాలన వృద్ధాశ్రమాన్ని సందర్శించిన అనంతరం మామిడిపల్లిలోని అపురూప వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించనున్నారు.

- జిల్లాలో వరిసాగుకే మొగ్గుచూపుతున్న రైతులు
- శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల కింద పెరుగుతున్న పంటల విస్తీర్ణం
- వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్న అధికారులు
- ప్రజాప్రతినిధుల సూచనలతో ఎరువులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు





గణనీయంగా యాసంగి సాగు



నిజామాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయడంతో వరిసాగు కొనసాగుతోంది. ఈ ప్రాజెక్టులే కాకుండా గుత్ప, అలీసాగర్, ఎత్తిపోతల పథకాలతో పాటు చెరువుల కింద కూడా సాగు కొనసాగుతోంది. భూగర్భ జలాలు ఎక్కువగా ఉండటంతో బోర్ల కింద కూడా ఈ యాసంగిలో ఆరుతడి పంటలకంటే వరిసాగు ఎక్కువ అవుతుంది. జిల్లాలో పంటల సాగుపై ముందే ప్రణాళికలు సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ అధికారులు వరిసాగు 70 శాతానికి పైగా అవుతుందని ప్రభుత్వానికి నివేదించారు. సాగుకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచారు.

లక్షా 80వేల ఎకరాల్లో వరిసాగు

జిల్లాలో యాసంగి సాగు పెరుగుతోంది. ఈ యాసంగిలో 5లక్షల 3వేల 741 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఇప్పటి వరకు జిల్లాలో 2లక్షల 67వేల 395 ఎకరాల్లో పంటలను వేశారు. ఈ పంటల్లో లక్షా 80వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఈనెల ఆఖరి వరకు వరిసాగు చేసే అవకాశం ఉండటంతో భారీగా అవుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వానికి 3లక్షల 96వేల ఎకరాల్లో సాగు అవుతుందని నివేదించారు. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో రైతులు వరినాట్లను కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ 10వేల ఎకరాలకు పైగా వరిసాగు పెరుగుతోంది. జిల్లాలో యాసంగి పంటకు మార్చి 31 వరకు సాగునీరు అందించడంతో పాటు అవసరమైతే ఏప్రిల్ వరకు కూడా నీటిని విడుదల చేయనుండటంతో ఎక్కువ మొత్తంలో రైతులు ఆరుతడి పంటలకంటే వరిసాగుకు మొగ్గుచూపుతున్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి లక్ష్మి కాలువతో పాటు గుత్ప, అలీసాగర్‌ల కింద ఈ నీటి విడుదలను చేస్తున్నారు. లక్ష్మికాలువలతో పాటు ఎత్తిపోతల పథకాల కింద సుమారు లక్షన్నర ఎకరాల వరకు సాగునీరు అందుతోంది. నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి కూడా అలీసాగర్ వరకు నీటి విడుదలను కొనసాగిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో సుమారు 70వేల ఎకరాల వరకు సాగునీరు అందుతుంది. ఈ రెండు ప్రాజెక్టులే కాకుండా రామడుగు రిజర్వాయర్‌తో పాటు చెరువుల కింద కూడా వరిసాగు చేస్తున్నారు.

లక్షా 75వేల వరకు బోర్ కనెక్షన్లు

జిల్లాలో లక్షా 75వేల వరకు బోర్ కనెక్షన్‌లు ఉన్నాయి. వీటి కింద కూడా రైతులు వరిపంటను వేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఆరుతడి పంటలు ముఖ్యంగా మొక్కజొన్న, ఎర్రజొన్న కలిపి 65వేల వరకు సాగయ్యింది. ఇవే కాకుండా నువ్వులు, పొద్దుతిరుగుడు, సజ్జ, ఇతర ఆరుతడి పంటలను రైతులు వేశారు. మొత్తం ఆరుతడి పంటలు లక్షా ఎకరాల వరకు ఉండగా ఎక్కువ మొత్తంలో వరిసాగును కొనసాగిస్తున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేస్తుండటం వల్ల ప్రాజెక్టుల పరిధిలోనే కాకుండా బోర్ల కింద కూడా ఈ పంటను సాగు చేస్తున్నారు. ధాన్యానికి డిమాండ్ కూడా పెరుగుతుండటం వల్ల ఎక్కువ మంది మొగ్గుచూపుతున్నారు. సన్నరకానికి డిమాండ్ వస్తున్న దొడ్డు రకాలను కూడా ఎక్కువ మొత్తంలోనే రైతులు వేస్తున్నారు. దొడ్డు రకాలకు నీటి అవసరం తక్కువగా ఉండటం త్వరగా పంట చేతికి వస్తుండటంతో యాసంగిలో ఎక్కువ విస్తీర్ణంలో వేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరిస్తుండటంతో ఈ సాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలో అన్ని మండలాల పరిధిలో పంటలకు అనుగుణంగా విద్యుత్ సరఫరా అవుతుండటంతో సాగు పెరుగుతోంది.

ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల

ప్రాజెక్టుల కింద ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటి విడుదల కొనసాగుతున్నా ఎక్కువ మొత్తంలో సాగును చేస్తున్నారు. ఈ నెలాఖరులోపు జిల్లాలో 4లక్షల ఎకరాల వరకు వరిసాగు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈసాగుకు అవసరమైన ఎరువులను అధికారులు అందుబాటులో ఉంచారు. జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన ఎమ్మెల్యేలు ఎప్పటికప్పుడు ఎరువులను సమీక్షించడంతో పాటు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలను తీసుకుంటున్నారు. ఇతర ప్రాంతాల నుంచి ఎరువులను జిల్లాకు తెప్పించి అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాలకు ఎక్కువ మొత్తంలో సరఫరా కొనసాగిస్తున్నారు. జిల్లాలో సాగు పెరుగుతుండటంతో అధికారులు కూడా కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచేందుకు చూస్తున్నారు. జిల్లాలో భూగర్భ జలాలతో పాటు ప్రాజెక్టులలో నీళ్లు ఎక్కువగా ఉండటం వల్ల వరిసాగు పెరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. ఈ నెలాఖరు వరకు విస్తీర్ణం భారీగా పెరుగుతుందన్నారు. రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచామని తెలిపారు.



బీఆర్ఎస్ పథకాలు కొనసాగేనా?

- గొర్రెల కొనుగోలు, దళితబంధు, బీసీబంధు పథకాల అమలుపై స్పష్టత కరువు
- గొర్రెల యూనిట్ల కోసం డీడీలను అందించిన లబ్ధిదారుల్లో ఆందోళన
- దళితబంధు, బీసీబంధు పథకాలపై లబ్ధిదారుల నజర్
- పథకాల అమలుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న దరఖాస్తుదారులు

నిజామాబాద్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పథకాలపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. గొర్రెల కొనుగోలు, దళితబంధు, బీసీబంధు పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గొర్రెల అభివృద్ధి పథకం కింద లబ్ధిదారుని వాటా కట్టిన వారు నిత్యం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తమకు రెండో విడత కింద గొర్రెలు పంపిణీ చేయాలని కోరుతున్నారు. వీరే కాకుండా గత ప్రభుత్వ హయాంలో దళితబంధు, బీసీబంధు కోసం దరఖాస్తు చేసిన వారు వాటి పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మంజూరు చేసిన జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక చేయకపోవడం వల్ల వారు ఆందోళన చెందుతున్నారు. కొంత మంది ఈ పథకాల కోసం పైరవీదారులను ఆశ్రయించి భారీ ఎత్తున డబ్బులు ఖర్చు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పథకాల అమలు జరిగే అవకాశం లేకపోవడంతో తమ డబ్బులు ఇప్పించాలని పైరవీదారుల చుట్టూ తిరుగుతున్నారు.

జిల్లాలో గొర్రెల పంపిణీ పథకం

జిల్లాలో గొల్లకుర్మల కోసం గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని అప్పటి ప్రభుత్వం అమలు చేసింది. మొదటి విడత కింద 10,722 మందిని ఎంపిక చేసి వారికి గొర్రెల యూనిట్లను మంజూరు చేసింది. ప్రతి ఒక్కరికీ యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందించింది. ఈ పథకం కింద లబ్ధిదారుని వాటా 25 శాతం కాగా, సబ్సిడీ కింద 75 శాతం ప్రభుత్వం ఇచ్చింది. రెండో విడత కింద జిల్లాలో 8,384 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. వీరిలో ఇప్పటి వరకు 929 మంది మాత్రమే గొర్రెల యూనిట్లను అందించింది. మిగతా వారికి పంపిణీ చేయలేదు. ఈ గొర్రెల యూనిట్ కోసం లబ్ధిదారులు తమ వాటాను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయగానే గొర్రెలను కొనుగోలు చేసి అందించారు. ఎన్నికల ముందు జిల్లాలో వెయ్యి మంది లబ్ధిదారులు తమ వాటా కింద 25 శాతం డీడీ 43వేల 750 రూపాయలను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేశారు. ఎన్నికల ముందు కొంత మందికి గొర్రెలను కొనుగోలు చేసి ఇచ్చిన కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కొనుగోలును నిలిపివేశారు. ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారిన తర్వాత ఇప్పటి వరకు వీటిపై నిర్ణయం తీసుకోలేదు. డబ్బులు చెల్లించిన లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గొర్రెల పెంపకం అభివృద్ధి పథకాన్ని ఈ ప్రభుత్వం కొనసాగిస్తుందా ? లేక నిలిపివేస్తుందా అనే ఆందోళనలో ఉన్నారు. జిల్లాలో వెయ్యి మంది లబ్ధిదారులు సుమారు 4కోట్ల 37లక్షల 50వేల రూపాయలను డీడీల రూపంలో చెల్లించారు. ఒకవేళ పథకం కొనసాగకుంటే తమ డబ్బులను తిరిగి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

దళితబంధు, బీసీబంధు దరఖాస్తుదారుల్లో ఆందోళన

దళితబంధు, బీసీబంధు పథకం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఎన్నికలముందు నియోజకవర్గానికి 1100 చొప్పున దళితబంధును మంజూరు చేశారు. లబ్ధిదారుల లిస్టును కూడా తయారు చేశారు. వారికి ఎంపికకు సంబంధించి మంజూరు ఇచ్చే ముందే ఎన్నికల కోడ్ రావడంతో నిలిపివేశారు. అన్ని నియోజకవర్గాల పరిధిలో లబ్ధిదారులను గుర్తించిన అమలుకు సంబంధించి మంజూరు ఇవ్వలేదు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ఈ పథకం ఆశించిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దళితబంధు మీద ఆశతో కొంత మంది గ్రామ, మండల స్థాయిలోనే నేతలను ఆశ్రయించారు. పథకం వస్తే 10లక్షల రూపాయలు రానుండటంతో లక్ష నుంచి రెండు లక్షల వరకు చెల్లింపులు చేశారు. ఎన్నికల ముందు కావడంతో ఎక్కువ మంది పైరవీలు కొనసాగించారు. వారి పేర్లను లిస్టులో ఉండే విధంగా చూశారు. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడగానే దళితబంధు అమలు చేస్తామని హామీలను ఇచ్చారు. ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పాలన పోయి కాంగ్రెస్ పాలన రావడంతో దళితబంధు వస్తుందని భావించిన వారు నిరాశకు గురయ్యారు. ఈ పథకం కోసం డబ్బులు పెట్టిన వారు పైరవీదారుల చుట్టూ తిరుగుతున్నారు. తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరుతున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అప్పటి ఎమ్మెల్యేలకు సంబంధించిన ప్రైవేటు పీఏలు భారీ ఎత్తున మామూళ్లు తీసుకున్నారు. వారి చుట్టూ కూడా ప్రస్తుతం లబ్ధిదారులు, పైరవీదారులు తిరుగుతున్నారు. ఇదే రీతిలో బీసీబంధుకు కూడా స్పష్టత లేకపోవడం వల్ల దరఖాస్తు చేసిన వారు సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో కొంత మందిని ఎంపిక చేసిన కోడ్ వల్ల వారికి ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఈ పథకాలపై స్పష్టత వస్తే తప్ప లబ్ధిదారుల్లో ఆందోళన తగ్గే పరిస్థితి లేదు. ఈ పథకాలపై అధికారులు మాత్రం ఎలాంటి హామీలను ఇవ్వడం లేదు.

భారంగా క్రీడల నిర్వహణ!

- అప్పుచేసి రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణ
- ఏడేళ్లుగా డబ్బులు చెల్లించని ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న ఎస్‌జీఎఫ్ మాజీ సెక్రెటరీలు, క్రీడానిర్వాహకులు

సుభాష్‌నగర్, జనవరి 3: జిల్లాలో క్రీడల నిర్వహణ భారంగా మారుతోంది. బిల్లులు అందక క్రీడా నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సంవత్సరం క్రీడాకారుల ఎంపికలు, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల కోసం ప్రభుత్వాలు కొంత మొత్తంలో డబ్బులు చెల్లించడం ఆనవాయితీగా వస్తుంది. మొదటగా క్రీడా నిర్వహణ కోసం నిర్వాహకులు, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు తమ సొంత డబ్బులు వెచ్చించి క్రీడలను నిర్వహిస్తారు. బిల్లులు ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అధికారులకు చెల్లించిన అనంతరం రాష్ట్రస్థాయిలో బిల్లులు విడుదల చేయాలి. కానీ అలా జరగడం లేదు. గత ఏడు సంవత్సరాలుగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడలకు ఒక్క వాటికి కూడా బిల్లులు చెల్లించలేదు. రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు అప్పులు చేసి క్రీడలను నిర్వహించారు. దీంతో పాటు క్రీడా సంఘాలకు సైతం అప్పులు చేసి క్రీడలను నిర్వహించింది. గతంలో ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం బిల్లులు చెల్లిస్తుండగా గత ఏడేళ్లగా బిల్లులు చెల్లించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలు ఇబ్బందులకు గురవుతున్నారు. అప్పులు చేసి క్రీడలు నిర్వహించి అప్పులు చెల్లించలేక వడ్డీలు కడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీఎఫ్ కాల పరిమితి రెండు సంవత్సరాల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.2కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఏడు సంవత్సరాలపైగా బిల్లులు రాకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 10కోట్లకు పైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం బిల్లులు విడుదల చేసినట్లు ప్రకటించిన వీరికి మాత్రం చెల్లించలేదు. నిజామాబాద్ జిల్లా గత ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ సుమారు 8లక్షల అప్పుచేసి రాష్ట్రస్థాయి క్రీడలను నిర్వహించాడు. క్రీడలు నిర్వహించి ఐదు సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. దీనికి తోడు మొదటగా మామూలు బిల్లులు ఇవ్వగా జీఎస్టీ బిల్లు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడంతో జీఎస్టీ బిల్లును కూడా ఇచ్చారు. అయినా ఇప్పటికీ బిల్లులు మంజూరు కాలేదు. అంతేకాకుండా క్రీడా సంఘాల ప్రతినిధులు సైతం రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను నిర్వహించారు. వీరికి కూడా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి డబ్బులు రావాలి. వీరికి కూడా ఇప్పటి వరకు డబ్బులు అందజేయలేదు. వీరి బకాయిలు కూడా లక్షల్లో ఉన్నట్లు తెలిసింది. క్రీడల నిర్వహణ ఎస్‌జీఎఫ్ సెక్రెటరీలకు భారంగా మారింది. నూతన ప్రభుత్వమైనా క్రీడల నిర్వహణపై శ్రద్ధ చూపాలని క్రీడా అభిమానులు, వ్యాయామ ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఇప్పటికైనా క్రీడల కోసం వచ్చించిన డబ్బులను ఇవ్వాలని తమను అప్పుల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.





కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: గ్రామీణ ప్రజల ముంగిట్లోకి కేంద్ర ప్రభుత్వ పథకాలు తీసుకెళ్తున్నట్లు వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర జిల్లా నోడల్ అధికారి నాగశ్రీనివాస్‌రావు తెలిపారు. బుధవారం నగరంలోని ధర్నాచౌక్‌లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ధర్మానాయక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వంద శాతం లబ్ధిదారులకు అందించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులై సంక్షేమ పథకాలు లబ్ధిపొందని వారు ఉండకూడదని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. క్యాలెండర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను సెల్‌ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ తెలుస్తాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని అర్హులైన ప్రతి ఒక్కరు కేంద్రం పథకాల గురించి అవగాహన పెంపొందించుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా నోడల్ అధికారి నాగశ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. వివిధ వర్గాల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామీణ ప్రజల ముంగిట్లోకి ఈ కార్యక్రమం ద్వారా తీసుకెళ్తున్నామన్నారు. అనంతరం ముద్ర, పీఎం స్వానిధి రుణాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. స్థానికులతో వికసిత్ భారత్ సంకల్ప్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కరపత్రాలను, గోడప్రతులను, క్యాలెండర్‌లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌వైకే జిల్లా కోఆర్డినేటర్ శైలిబెల్లాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వలక్ష్మీనర్సయ్య, అరవింద్‌కుమార్, న్యాలం రాజు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.









తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని బుధవారం మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు దర్శించుకున్నారు. బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వారితో పాటు శాసనమండలి మాజీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ దంపతులు, గడిల శ్రీరాములు దంపతులు, ఆకుల సురేందర్ దంపతులు శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత దంపతులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: రాష్ట్రంలో మళ్లీ కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న దృష్ట్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ కోరారు. ప్రజలు బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా మాస్కులు ధరించాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే ఆసుపత్రికి వెళ్లి టెస్టులు చేయించుకోవాలని సూచించారు. చలి తీవ్రత నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

తపస్వీ తేజోనిలయంలో అన్నదానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 3: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో తపస్వీ తేజోనిలయంలో బుధవారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్ మార గంగారెడ్డి విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్వీ తేజోనిలయం విద్యార్థులకు తనవంతు సేవలను ఎల్లవేళల అందిస్తానని, అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు పట్వారీగోపి కృష్ణ, కార్యదర్శి పట్వారితులసీ, శశిధర్, తేజోనిలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ ఆర్టీసీ డిపోమేనేజర్‌గా ఆంజనేయులు

పెర్కిట్, జనవరి 3: ఆర్మూర్ పట్టణ ఆర్టీసీ డిపో నూతన డిపో మేనేజర్‌గా బి.ఆంజనేయులు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లోని కాచిగూడ ఆర్టీసీ డిపో నుంచి ఆంజనేయులు బదిలీపై ఆర్మూర్ డిపోకు వచ్చారు. గత డిపో మేనేజర్ టి.శ్రీనివాస్ డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు.



ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్

సంక్షేమ ఫలాలు ప్రతీ లబ్ధిదారునికి అందాలి

బోధన్ రూరల్, జనవరి 3: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలనలో భాగంగా ప్రతి దరఖాస్తును అధికారులు స్వీకరించాలని, అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందాలని బోధన్ మున్సిపల్ ఛైర్ పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని 27, 29 వ వార్డులలోని సభలను ఆమె పర్యవేక్షించారు. ప్రజా పాలన కార్యక్రమం నిర్వహణ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించాలన్నారు. ఇప్పటి వరకు కౌంటర్ల ద్వారా తీసుకున్న దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి లబ్ధిదారుడు దరఖాస్తుతో ఆధార్, రేషన్ కార్డును జతచేసి వెంటనే రసీదు తీసుకోవాలన్నారు. అధికారులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. దరఖాస్తుల ఫారాల కోసం ప్రజలు ఇబ్బందులు పడవద్దని, ప్రభుత్వమే ఉచితంగా దరఖాస్తు ఫారాలను అందజేస్తుందన్నారు. ఎవరైనా దరఖాస్తు ఫారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డీఈ శివానందం, నరేందర్, కౌన్సిలర్లు అబ్దుల్లా, శ్రీకాంత్‌గౌడ్, శరత్‌రెడ్డి, వార్డు ప్రజలు తదితరులు ఉన్నారు.

నేడు ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

ఆర్మూర్‌టౌన్, జనవరి 3: ఆర్మూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ పండిత్ వినీతపై గురువారం అవిశ్వాస పరీక్ష పెట్టనున్నారు. దీంతో మున్సిపల్ కార్యాలయంలో సమావేశానికి అన్ని ఏర్పాట్లను చేశారు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన పలువురు కౌన్సిలర్‌లు రాష్ట్ర సరిహద్దుల్లో క్యాంపులలో ఉన్నారు. అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్న పలువురు కౌన్సిలర్‌లు జిల్లా కేంద్రంలో ఉన్నట్లు తెలిసింది. ఇదీలా ఉండగా అవిశ్వాస పరీక్షకు 2/3సభ్యులు హాజరుకావాల్సి ఉంది. ప్రస్తుతం అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చిన 24మంది కౌన్సిలర్‌లలో నలుగురు పండిత్ వినీతకు మద్దతుగా ఆమె నిర్వహించే క్యాంప్‌లోకి వెళ్లి పోయారు. దీంతో ఎంఐఎం, బీఆర్ఎస్ కలుపుకొని 20మంది కౌన్సిలర్‌లు ఉండగా బీజేపీ కౌన్సిలర్‌ల మద్దతు కచ్చితమైంది. వీరు అవిశ్వాస పరీక్ష నెగ్గాలన్నా, వీగాలన్నా వారి మద్దతు కోసం మున్సిపల్ ఛైర్‌పర్సన్ పండిత్ వినీత భర్త పవన్, అలాగే మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ స్వాతిసింగ్ భర్త బబ్లు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

నందిపేట, జనవరి 3: మండల కేంద్రంలోని రాజానగర్ దుబ్బా ప్రాంతంలో బుధవారం అయోధ్య రాముడి అక్షింతలను బీజేపీ నాయకులు ఇంటింటికీ పంపిణీ చేశారు. అలాగే అక్షింతలతో పాటు నూతనంగా ఉత్తప్రదేశ్‌లోని అయోధ్యలో నిర్మించిన రామ మందిరం ఫొటోలను వితరణ చేశారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అక్షింతలు రామ మందిరం ఫొటోలను పూజించారు. వాటిని తీసుకువెళ్లి పూజ గదిలో భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరుట్ల రమేష్, ఏర్రం లింగం, కరెంట్ సంతోష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మల్లన్న స్వామి ఉత్సవాలు

కమ్మర్‌పల్లి, జనవరి 3: మండలంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూలగుట్టపై కొలువుదీరిన గ్రామయాదవుల ఆరాధ్యదైవం మల్లన్న స్వామి జాతర ఉత్సవాలు ముగిసినట్లు యాదవ సంఘ సభ్యులు తెలిపారు. బుధవారం సాయంత్రం గుట్టపైగల మల్లన్న స్వామి ఆలయ వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేయగా భక్తులు యాదవసంఘ సభ్యులు అగ్నిగుండ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఒగ్గు కళాకారుల బృందం సభ్యులు మల్లన్న స్వామి జీవిత చరిత్రను వినిపించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన స్వామివారి జాతరా ఉత్సవాలు ప్రత్యేక పూజలకు హజరై స్వామివారికి కట్నకానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘం అధ్యక్షుడు ముత్తన్న, కార్యదర్శి రాజు, సభ్యులు బక్కన్న, నారాయణ, ప్రశాంత్ నడప్పన్న, బైకాని మహేష్, అబ్బాస్, సామెర సుమన్, గ్రామ యాదవ కుల సంఘం సభ్యులు, మహిళలు, గ్రామస్థులు, మల్లన్న దీక్షాపరులు పాల్గొన్నారు.













నాడాపూర్‌లో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు

నవీపేట, జనవరి 3: మండలంలోని నాళేశ్వర్, తుంగిని, నాడాపూర్, జన్నేపల్లి, మిట్టాపూర్, మట్టయ్య ఫారంలలో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. ప్రజలు గ్యారంటీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోగా అధికారులు వాటిని స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధన్‌వాల్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● గుండారంలో గ్రామసభ

నిజామాబాద్‌రూరల్, జనవరి3: రూరల్ మండలం గుండారం గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులపై గ్రామసభ నిర్వహించారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఉపసర్పంచ్ శంకర్ రెడ్డి, ఎంపీటీసీ గంగాధర్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో ఇప్పటివరకు 900 మంది పలు సేవల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు తీసుకుని సరియైన ధృవీకరణ పత్రాలను సరిచూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లేష్, డిప్యూటీ తహశీల్దార్ రంజిత్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హరీష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదాకర్‌రెడ్డి ఉన్నారు.

● ప్రజా సమస్యల కోసమే ప్రజా పాలన

వర్ని: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీవో బషీరుద్దీన్ తెలిపారు. బుధవారం జలాల్‌పూర్, కూనిపూర్ గ్రామాల్లో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో ఆయన మాట్లాడారు. ప్రజలు అందించే దరఖాస్తులను ఉన్నతాధికారులకు అందజేసి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసేలా కృషి చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్, సీహెచ్ గంగారాం, నరెడ్ల బాలు, హన్మాగౌడ్, నరెడ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. చందూర్ మండల కేంద్రంలో ప్రజా పాలన దరఖాస్తు స్వీకరణను ప్రత్యేక అధికారి సింహచలం తనిఖీ చేశారు.

షుగర్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులను ఆదుకోవాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

బోధన్ రూరల్, జనవరి3: ప్రభుత్వం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు చెల్లించి ఆదుకోవాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి ఎ.రమేష్‌బాబు అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్‌లోని కాకయ్య స్వామి మఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినహామీ ప్రకారం నిజాంషుగర్స్ ఫ్యాక్టరీతో పాటు ఎడపల్లి మండలంలో ఉన్న షుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా కార్మికులకు వేతన బకాయిలు రాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని లేఆఫ్ నుంచి తీసేసి ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో బోధన్ డివిజన్ కార్యదర్శి ఏశాల గంగాధర్, సీపీఎం పార్టీ జిల్లా నాయకులు గంగాధరప్ప, శంకర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

దూపల్లిలో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన

రెంజల్, జనవరి3: మండలంలోని దూపల్లి గ్రామంలో గ్రామదేవతల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం వేద పండితుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహలక్ష్మి, గజ్జెలమ్మ, పోత లింగయ్య విగ్రహలతో పాటు గ్రామంలో మొత్తం 25 విగ్రహలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిరెడ్డి, ఉపసర్పంచ్ సాయిలు, తదితరులున్నారు.



సావిత్రీబాయిపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న బస్వాలక్ష్మినారాయణ



ఇందల్వాయిలో..

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

● జిల్లావ్యాప్తంగా ఆయా పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు

● నివాళులర్పించిన నాయకులు, అధికారులు

నిజామాబాద్ అర్బన్, జనవరి3: భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. పలు పార్టీలు, పలు సంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వలక్ష్మీనర్సయ్య, నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, బాలికల విద్య కోసం, సామాజిక దురాచారాలను రూపుమాపడం కోసం ఆమె కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామియాదవ్, శివప్రసాద్, శ్రీనివాస్, కిశోర్, గిరిబాబు, ఎర్రంసుధీర్, తదితరులు పాల్గొన్నారు.

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడారు. తాను చదువుకొని సాటి స్ర్తీలకు విద్య చెప్పేందుకు అనేక పోరాటాలు చేసి సావిత్రీబాయి పూలే విద్యను అందించారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, పవన్, భరత్, అరవింద్, వినయ్ పాల్గొన్నారు.

● ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

సావిత్రీబాయి పూలే జయంతిని ఎస్ఎఫ్ఐ నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కోటగల్లి బాలికల జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వామి హాజరై మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప వ్యక్తి సావిత్రిబాయి పూలే కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నుస్రత్ జహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు విఘ్నేష్, అనిల్, విశాల్, పాల్గొన్నారు.

● బీసీ సంఘం ఆధ్వర్యంలో...

సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బీసీ సంక్షేమ సంఘం నాయకులు, మేరు సంఘం నాయకులు నగరంలోని అంబేద్కర్ కాలనీ వద్ద గల సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు సోమ హన్మంత్‌రావు, గంగాకిషన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు నరాల సుధాకర్ ఉన్నారు.

● మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి

సుభాష్‌నగర్: మహిళల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని నగర మేయర్ దండు నీతూకిరణ్ అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ కాలనీలోగల సావిత్రీబాయి పూలేజయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉమారాణి ముత్యాలు, నాయకులు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● సావిత్రీబాయి పూలే కృషితోనే స్ర్తీలకు స్వేచ్ఛ

డిచ్‌పల్లి: మహిళలకు స్వేచ్ఛ, సమానత్వం, విద్యా అందించిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షుడు కొమిరే శ్రీశైలం అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా టీయూఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా సావిత్రబాయి పూలే చిత్రపటానికి మాజీ రిజిస్ట్రార్ ప్రొ.కనకయ్య పూలదండ వేసి నివాళ్లు అర్పించారు.

● మల్లారంలో..

నిజామాబాద్‌రూరల్: మండలంలోని మల్లారంలో సావిత్రీబాయి పూలే 193వ జయంతి ఘనంగా నిర్వహించారు. బుధవారం మల్లారంలోని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో జెడ్పీహెచ్ఎస్‌లో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, రమేష్, నెహ్రూ, లక్ష్మణ్, శ్రవణ్ పాల్గొన్నారు.

● టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో..

డిచ్‌పల్లి: టీయూలో ఏబీవీపీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఏబీవీపీ యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు తోట సాయికృష్ణ సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, నాయకులు పాల్గొన్నారు.

● పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

పీడీఎస్‌యూ వర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో బాలికల హాస్టల్ ఎదుట సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిపూలేకు పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. అనంతరం టీయూ పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి జయంతి మాట్లాడారు. యూనివర్సిటీ సమస్యలపై సావిత్రి బాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్సిటీ నాయకులు రవీందర్, హన్మండ్లు, ఆకాశ్, మోహిత్, పీరు సింగ్, పవిత్ర, ప్రతిజా పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి పేర్కొన్నారు. కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలదండవేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలుగు విభాగంకళల పీఠాధిపతి ఆచార్యత్రివేణి మాట్లాడారు. పీడిత ప్రజలు ముఖ్యంగా స్ర్తీల విద్యాభివృద్ధికి కృషిచేసిన గొప్ప వీరవనిత అని అన్నారు. కార్యక్రమంలో ప్రొ.లావణ్య, ప్రొ.కనకయ్య, డా.పాతనాగరాజు, డా.సంపత్, ముషాఖురేషీ, భ్రమరాంబిక, స్రవంతి, దత్తహరి, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● బీసీ సంఘం ఆధ్వర్యంలో..

టీయూలో బీసీ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు, విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు, పాటాలపోటీలు, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి, ప్రొ.త్రివేణి, డైరెక్టర్ ఆఫ్ పీఆర్వో పున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: మండలంలోని మూషీర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా యువజన సంఘాల నాయకుడు గురిజల హరీష్ మాట్లాడారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం వేణు ఉన్నారు. అలాగే కుల వివక్ష పోరాట సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీబాయి పూలే జయంతిని వేడుకలో ఆ సంఘం మండల అధ్యక్షులు శంకర్ మాట్లాడారు.

ఇందల్వాయి: జనవరి 3ను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని పీడీఎస్‌యూ నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ డిమాండ్ చేశారు. ఇందల్వాయి మండల కేంద్రంలోని బాలికల ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలలో భారతదేశం మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. సావిత్రీబాయి పూలే అదర్శ విప్లవస్ఫూర్తి చదువుల తల్లి అని కొనియాడారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, తదితరులు ఉన్నారు.

● ఆర్మూర్‌లో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. పట్టణంలోనీ యూపీహెచ్‌సీ కేంద్రంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సాయి, ఫిర్దోస్, శ్రీనివాస్, శేఖర్, తదితరులున్నారు.

● సీపీఎం ఆధ్వర్యంలో..

ఖిల్లా: మహిళలకు తగిన రక్షణ ఉన్నప్పుడే సావిత్రీబాయి పూలే ఆశయం నెరవేరుతుందని సీపీఐఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐఎం పార్టీ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే 193వ జయంతిని నిర్వహించారు.



టీయూలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న యువజన సంఘం నాయకులు

ఆవాస ప్రాంత పాఠశాల ప్రారంభం



విద్యార్థులను ఆవాసప్రాంత పాఠశాలలో చేర్పుతున్న అధికారులు

రామారెడ్డి, జనవరి 3: మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో బుధవారం ఆవాస ప్రాంత పాఠశాలలను జిల్లా సెక్టోరియల్ అధికారి వేణుశర్మ, శ్రీపతిలు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వలస వచ్చి కూలీ పనిచేస్తున్న తల్లిదండ్రుల అనుమతితో 16 మంది పిల్లలతో పాఠశాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు ఆనంద్‌రావు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, వాలీంటర్ వెంకటేష్, ఇటుకబట్టి యాజమాని గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న దృశ్యం

మాచారెడ్డి,జనవరి3: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీని సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఏడు హుండీలలో రూ.2,63,407 ఆదాయం వచ్చినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఆలయ ఈవో శ్రీదర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ సంతోష్‌కుమార్, లక్ష్మన్,ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు

నవీపేట,జనవరి3: మండలంలోని మద్దెపల్లిలో బుధవారం అయోధ్యలోని శ్రీరామ మందిరానికి చెందిన అక్షింతలకు ఊరేగింపు నిర్వహించారు. స్థానిక హనుమాన్ మందిరం నుంచి గ్రామంలోని పలు వీధుల గుండా అక్షింతల కళశానికి ఊరేగింపు నిర్వహించారు.ఈ ఊరేగింపులో గ్రామంలోని మహిళలు హారతితో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో రమేష్, సందీప్, తదితరులున్నారు.



మద్దెపల్లిలో అయోధ్య అక్షింతలకు ఊరేగింపు దృశ్యం

బీర్కూర్‌లో తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

బీర్కూర్, జనవరి 3: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం కాలమానిని ప్రధానోపాధ్యాయుడు మోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశభక్తి, సంస్కృతి ప్రతిబింబించే విధంగా కాలమానిని రూపొందించామని అన్నారు. నూతన జాతీయ విద్య విధానం - 2020 అమలు, ఉపాధ్యాయ సమస్యలు, సీపీఎస్ విధానం రద్దు, డీఏ బకాయిలు, బదిలీలు, ప్రమోషన్లు, 317 బాధిత ఉపాధ్యాయులను వెంటనే స్థానిక జిల్లాలకు పంపించాలని, పండిత వ్యాయామ, ఉపాధ్యాయులకు ప్రమోషన్లు చేపట్టడం తదితర సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి రాష్ట్ర శాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభన్ బాబు, హన్మాండ్లు, శ్రీనివాస్, గంగాధర్, చంద్రశేఖర్, సందీప్ కుమార్, శివలాల్, గాయత్రి, సరిత పాల్గొన్నారు.



బీర్కూర్‌లో తపస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జిల్లా అంతటా ఘనంగా సావిత్రీబాయిపూలే జయంతి



సావిత్రీబాయిపూలే విగ్రహనికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డిటౌన్,జనవరి 3: కామారెడ్డి జిల్లా అంతటా సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా బుధవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గల విగ్రహనికి బీజేపీ తదితర సంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలో మొదటిమహిళా ఉపాధ్యాయురాలు,మహిళలకు చదువును అందించడానికి మొదటి పాఠశాలను స్థాపించిన సంఘసంస్కర్త అని అన్నారు.భర్త అడుగుజాడల్లో నడుస్తూ కులమతలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన పేమస్వరూపిణి అని విద్యతోనే స్ర్తీకి విముక్తి సాధ్యపడుతుందని పూణేలో మొట్ట మొదటి పాఠశాల స్థాపించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార,ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డి: సావిత్రీబాయిపూలే జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో ఆమె విగ్రహనికి,ఘన్‌పూర్(ఎం) ప్రభుత్వ పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడుతూ సత్యశోధక్ సమాజ్ ఏర్పరిచి సమాజంలో జరుగుతున్న మూఢత్వాన్ని తేటతెల్లం చేశారని కొనియాడారు. సమాజంలో కుల,మత వర్గబేదాభిప్రాయాలు లేకుండా సమాజమంతా ఒకటేనని చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజురాణి, ఉపాధ్యాయ బృందం అంతయ్య, దేవిచంద్, కల్పన,కవిత,పొదర్లరవి, బాబు, జాన్, బాలచంద్రం, సంజీవ్,సత్యం,నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: తాడ్వాయి మండలంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.మండలంలోని ఎర్ర పహాడ్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఎస్ఆర్ఐ ప్రభోదన్‌రెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు కావాల్సిన ఫర్నీచర్‌కు సహాయం చేస్తామని తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు సంగారెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీ జలంధర్‌రెడ్డిపాల్గొన్నారు.

బీబీపేట: బీబీపేటమండలంలోని తుజాల్‌పూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూమహిళ విద్యాప్రాధాన్యతను పెంచిన మహోన్నత వ్యక్తి అని, కులమతాలకు అతీతంగా మహిళ విద్యను ప్రోత్సహించిన మొట్ట మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిభాయి పూలే అని ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోసభ్యులు తలారి ప్రభాకర్, నాగరాజు, చంద్రగౌడ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డిటౌన్,జనవరి 3:కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని లింగాపూర్ వద్దగల స్వప్నలోక్‌లో మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసు కోవాలని కాలనీవాసులు కమిషనర్ దేవేందర్‌కు బుధవారం ఫిర్యాదుచేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పీఆర్ స్కూల్ సమీపంలో ఒక సంఘం నాయకులు ఎవరికి ఎలాంటి సమాచారం లేకుండా సంఘభవన నిర్మాణం కొరకు నిర్మాణ పనులు చేపడుతున్నారని అన్నారు.కాలనీ ఏర్పాటు సమయంలో మున్సిపల్‌కు స్థలం వదిలితే ఆ స్థలంలో గతంలో మున్సిపల్ కమీషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు సైతం మొక్కలు నాటారని తెలిపారు. ప్రస్తుతం ఆమొక్కలను తొలగించి దేవునిపల్లికి చెందిన కిసాన్ మున్నూరుకాపు సంఘం వారు సంఘ భవన నిర్మాణం చేపడుతున్నారని ఆరోపించారు.ఏదైనానిర్మాణం చేపట్టదలుచుకుంటూ కాలనీవాసులకు అనుకూలంగా నిర్మాణాలు చేపట్టాలి కానీ ఈ విధంగా ఎక్కడి నుంచి ఇక్కడికి వచ్చి మున్సిపల్‌కోసం విడిచిన ఖాళీ స్థలంలో పనులు చేపట్టడం ఎంటని ప్రశ్నించారు.ఈ నిర్మాణాన్ని మున్సిపల్ అధికారులు ఆపకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని అవసరమైతే పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కాలనీవాసులు

ఎఫ్‌టీఎస్‌లకు జీతాలు చెల్లించాలి

కామారెడ్డిటౌన్,జనవరి 3: జిల్లాలోని తహసీల్దార్ కార్యాలయాలలో వ్యవసాయభూముల రిజిస్ట్రేషన్‌లకు ధరణిప్రోగ్రాం పరిధిలో నియమించబడిన ఎఫ్‌టీఎస్(ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్)లకు జీతాలు అందించాలని ఎఫ్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం బుధవారం ఒక ప్రకటనలో కోరారు.గత 10 నెలలుగా జీతాలు అందక సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 2018లో ఎఫ్‌టీఎస్‌లుగా నియమించబడిన తమకు చాలీచాలని జీతాలు అందించడమే కాకుండా సమయానికి అందించడం లేదని తెలిపారు. ప్రస్తుతం కేవలం రూ.11583 జీతం మాత్రమే చెల్లిస్తున్నారని ఆ జీతం సైతం 10 నెలలుగా చెల్లించకపోవడం సిగ్గుచేటని అన్నారు.ధరణి కంప్యూటర్ ఆపరేటర్‌ల జీతాలు రూ.31040 పెంచాలని, మహిళలు కూడా విధులు నిర్వహిస్తున్నందున వారికి వేతనంతో పాటు ప్రసూతి సెలవులు ఇవ్వాలని,జీతాలు డీడీఓ ద్వారా గాని కలెక్టర్ ద్వారా గాని ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.

తండాల్లో పోలీసుల కార్డాన్ సెర్చ్



పంట పొలాల్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

గాంధారి,జనవరి 3:మండలంలోని చద్మల్‌తండా, నేరల్,బిర్మల్ తండాలలో బుధవారం ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సదాశివనగర్ సీఐ రామన్, జిల్లాలోని 14 మంది ఎస్ఐలు, 3గురు ఏఎస్ఐలు,ఐదుగురు హెడ్‌కానిస్టేబుల్‌లు, 37 మంది పోలీసు కానిస్టేబుల్‌లు, 9 మంది హోంగార్డులు తదితర కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు క్షేత్రస్థాయిలో గంజాయి మొక్కల పెంపకం ఎక్కడైన ఉందా అని పరిశీలించారు. చద్మల్‌తండాలో ఒక గుర్తుతెలియని వ్యక్తి నుంచి 15 కిలోల ఇప్పపూవ్వు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సాగుపై నిఘా ఉంచడంతో పాటు ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామని డీఎస్పీ తెలిపారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

దోమకొండ, జనవరి 3:ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పథకాలకు ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని జడ్పీటీసీ తీగల తిర్మల్ గౌడ్, మండల ప్రత్యేకాధికారిణి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని సంగమేశ్వర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరు పథకాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



సంగమేశ్వర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి



బస్‌డిపో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

డిపో స్థలాన్ని ప్రజా అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుదాం

- నందిపేట బస్‌డిపో స్థలాన్ని పరిశీలించిన ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

నందిపేట, జనవరి3: మండల కేంద్రంలో బస్‌డిపో స్థలాన్ని ప్రజా అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుదామని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆర్టీసీ అధికారులకు సూచించారు. బుధవారం మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్‌డిపో స్థలాన్ని ఆయన పరిశీలించారు. కంపుకొడుతున్న ఆ స్థలాన్ని క్రీడా ప్రాంగణం లేదా వడ్ల ఆరబెట్టే కళ్లాలుగా మార్చుదామని, అందుకు ఆర్టీసీ అధికారులు సహకరించాలని కోరారు. పక్కనేఉన్న మార్కెట్ షెడ్డును పరిశీలించారు. శుభ్రంగా చేసి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయాలని స్థానిక మండలపరిషత్ అభివృద్ధి అధికారి నాగవర్ధన్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం నందిపేట మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్, మండల ప్రాథమిక పాఠశాల, కస్తూర్బా, మోడల్ స్కూల్‌లను తనిఖీ చేశారు. ముఖ్యంగా మూత్రశాలలను ఆయన పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకోవడం, దుర్వాసన రావడంతో సొంత ఖర్చులతో మరమ్మతులు చేయిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. అలాగే మధ్యాహ్న భోజనం బిల్లులు వేలు రావాలని వంట మనిషి ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో తాను డబ్బులు పంపుతానని, బిల్లులు రాగానే మళ్లీ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పెద్దోల్ల గంగారెడ్డి, ఎంపీడీవో నాగవర్ధన్, ఎస్‌ఐ జి రాహుల్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు భూతం సాయరెడ్డి, ఆరుట్ల రమేష్, గడ్డం చిన్నారెడ్డి, తదితరులు ఉన్నారు.

బాలుర గురుకుల పాఠశాల పరిశీలన

పెర్కిట్, జనవరి3: ఆర్మూర్ పట్టణంలోని బాలుర గురుకుల పాఠశాలను బుధవారం ఎంఈవో రాజగంగారాం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేస్తూ విద్యార్థులు అనుమతి లేకుండా బయట తిరగకూడదని, బయటి తినుబండరాలు తినొద్దని, క్రమశిక్షణతో మెలగాలని విద్యార్థులకు తెలిపారు. పాఠశాల ప్రహరీకి ఉన్న దూరాన్ని సరిచేయాలని ప్రిన్సిపాల్ దుర్గారెడ్డి, అధ్యాపకులు స్వప్నకు సూచించారు. అదే విధంగా పాఠశాల వాచ్‌మెన్‌కు విద్యార్థులపై నిఘా ఉంచాలని అన్నారు. ఎంఈవో వెంట ఉపాధ్యాయులు సతీష్, వార్డెన్ సురేష్ ఉపాధ్యాయులు ఉన్నారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల పంపిణీ

కమ్మర్‌పల్లి, జనవరి3: మండలంలోని హసాకొత్తూర్‌లో క్రీడాకారులకు కేసీఆర్ క్రికెట్ కిట్లను బుధవారం సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ పంపిణీ చేశారు. గత ప్రభుత్వం క్రీడాకారుల ప్రోత్సాహం నిమిత్తం క్రీడాపరికరాలను అందజేయగా ఎన్నికల కోడ్‌తో ఆగిని పంపిణీని బుధవారం అందజేశామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, జీపీ పాలకవర్గ సభ్యులు రమేష్, శ్రీనివాస్, నవీన్, మహేందర్, పాఠశాల హెచ్‌ఎం డిఎల్‌ఎన్‌చారి, ఉపాధ్యాయుడు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ కోచ్‌లుగా అన్నదమ్ముళ్లు

భీమ్‌గల్ రూరల్, జనవరి 3: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ కోచ్‌లుగా మండలంలోని జాగిర్యాల్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు అన్నదమ్ముళ్లు ఎంపికయ్యారు. సంగెం రాహుల్, సంగెం ప్రశాంత్ ఇరువురు సోదరులు. చత్తీస్‌ఘడ్, రాజస్థాన్‌లో జరిగే 67వ జాతీయస్థాయి అండర్-14, అండర్-17, బాలుర,బాలికల జట్టులకు కోచ్‌గా వ్యవహరించనున్నారు.

బేస్‌బాల్ పోటీలకు మిట్టపల్లి విద్యార్థి ఎంపిక

డిచ్‌పల్లి, జనవరి3: ఈనెల 2 నుంచి 5వరకు ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్‌లో జరుగుతున్న జాతీయస్థాయి బెస్‌బాల్ పోటీల్లో మిట్టపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి కొమిరె విష్ణు పాల్గొంటున్నాడని ప్రధానోపాధ్యాయుడు సుశీల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడకారుడు విష్ణును సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ కిషన్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, వ్యాయమ ఉపాధ్యాయుడు మర్కంటి గంగామోహన్ అభినందించారు.

గల్ఫ్‌లో దూస్‌గాం వాసి మృతి

డిచ్‌పల్లి, జనవరి3: డిచ్‌పల్లిలోని దూస్‌గాం గ్రామానికి చెందిన ఎస్.ప్రవీణ్ కుమార్ (30) ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లగా పనిచేస్తూ ప్రమాదవశాత్తు నిచ్చెనపై నుంచి కిందపడి మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ గల్ఫ్‌లో ఐదేళ్లుగా ఎలక్ట్రిషియన్ పనిచేస్తున్నాడు. మంగళవారం నిచ్చెన ఎక్కి పనిచేస్తున్న క్రమంలో నిచ్చెన విరిగిపోవడంతో ప్రవీణ్‌కుమార్ కిందపడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహన్ని స్వదేశానికి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు. మృతుడికి భార్య సమత, పిల్లలు అద్విత(9), వేదశ్రీ(6) ఉన్నారు.

వాహనం ఢీకొని మహిళకు గాయాలు

డిచ్‌పల్లి, జనవరి3: డిచ్‌పల్లిలోని ఘన్‌పూర్ టీటీడీసీ వెళ్లే రోడ్డుపై బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళకు తీవ్రగాయాలు అయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే 108లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మహిళను స్థానికులు అడగగా తనది మాచారెడ్డి చౌరస్తా అని తెలిపింది.

కొడిచర్లలో కరెంట్ షాక్‌తో గేదె మృతి

మెండోర, జనవరి3: మండలంలోని కొడిచర్ల గ్రామంలో కరెంటుషాక్‌తో గేదె మృతిచెందినట్టు వైస్‌ఎంపీపీ పడాల సరస్వతి రవిగౌడ్ తెలిపారు. మృతి చెందిన గేదే విలువ రూ.60వేల ఉంటుందని రైతు తెలిపారు.

లేబర్ కార్డుపై అవగాహన

మోస్రా, జనవరి3: మండల కేంద్రంలోని బుధవారం లేబర్‌కార్డులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ ఆదేశాల మేరకు సీనియర్ ట్రైనర్ ప్రదీప్ కుమార్ కూలీలు, తాపీ మేస్త్రీలకు లేబర్ కార్డుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సెఫ్టీడ్రెస్, హెల్మెట్, పెన్, బుక్, బ్యాగ్‌ఇస్తూ స్టయిఫండ్ రూపంలో రోజు రూ.300 ఇస్తూ అవగాహన కల్పిన్నట్లు తెలిపారు. అనంతరం బ్యాగ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సదా శివుడు, నాగరాజు, లక్ష్మి, సవిత, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కార్డుదారులకు బ్యాగ్‌లను పంపిణీ చేస్తున్న దృశ్యం

దరఖాస్తుల స్వీకరణలో అలసత్వం వద్దు

- ప్రతీ దరఖాస్తు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా



సాటాపూర్‌లో దరఖాస్తుల తీరును పరిశీలిస్తున్న చిత్రా మిశ్రా



సిరికొండలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

రెంజల్, జనవరి3: ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణలో అధికారులు, సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా అన్నారు. మండలంలోని సాటాపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పరిశీలించారు. ప్రజా పాలనలో ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ప్రజాపాలనలో ప్రజలు ఇచ్చిన ప్రతీ దరఖాస్తును తీసుకోవాలని, ఇప్పటివరకు తీసుకున్న దరఖాస్తులను కౌంటర్ల వారిగా వివరాలను నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు అందించే గ్యారంటీ పథకాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన కల్పించాలని, ప్రజాపాలన ప్రక్రియ త్వరితగతిన దరఖాస్తులను స్వీకరించి పూర్తిచేయాలని సూచించారు. ఆమె వెంట జడ్పీ సీఈవో గోవింద్ నాయక్, డీఎల్‌పీవో గొసోద్దీన్, ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ వికార్ పాషా, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ ఉన్నారు.

సిరికొండ: మండలంలోని కొండాపూర్, తూంపల్లి, చీమన్‌పల్లి, తాటిపల్లి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలను అదనపు కలెక్టర్ యాదిరెడ్డి బుధవారం పర్యవేక్షించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే ఆరు గ్యారంటీల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తమ కుటుంబాలకు అమలయ్యే పథకాలను ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నూతన రేషన్ కార్డుల కోసం, ఉన్న కార్డుల్లో పేర్లను నమోదు చేసుకోవడానికి కూడా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతీ దరఖాస్తును స్వీకరించి రశీదును అందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆయనవెంట మండల ప్రత్యేక అధికారి నాగరావు, సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు ఉన్నారు.

గల్ఫ్‌లో ఉన్నవారి పేర్లను రేషన్‌కార్డుల్లో చేర్చండి

- మంత్రిని కోరిన ముత్యాల సునీల్‌కుమార్



మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మోర్తాడ్, జనవరి3: గల్ఫ్ వెళ్లిన వారి పేర్లను రేషన్ కార్డుల్లో నుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొలగించిందని, ఆ పేర్లను తిరిగి చేర్చాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ గల్ఫ్ కార్మికులు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లారని, గల్ఫ్‌లో ఉన్న వారి పేర్లు కూడా రేషన్‌కార్డుల్లో నమోదు చేయించడానికి అనుమతి ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు. మంత్రి సీతక్కను కలిసి బాల్కొండ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో గ్రామాల్లో నాణ్యత లేకుండా చేసిన పనుల గురించి వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని కోరారు.

'చౌట్‌పల్లి సింగిల్ విండో చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టండి'



తీర్మాన ప్రతిని అందజేస్తున్న సభ్యులు

కమ్మర్‌పల్లి, జనవరి 3: మండలంలోని చౌట్‌పల్లి సహకార సంఘం చైర్మన్ కుంటప్రతాప్ రెడ్డిపై అవిశ్వాసాన్ని ప్రకటిస్తూ వైస్‌చైర్మన్ సహా ఆరుగురు సభ్యులు తీర్మానాన్ని బుధవారం జిల్లాసహకార బ్యాంక్ అధికారి (డీసీవో) సింహాచలానికి అందజేశారు. సహకారం సంఘ అధ్యక్షుడు పాలకవర్గ సభ్యుల విశ్వాసాన్ని కోల్పోయాడని చైర్మన్‌పై అవిశ్వాసతీర్మానం పెట్టేందుకు నిర్ణయించుకున్నామని, తీర్మానాన్నిపరిశీలించి పాలకవర్గం ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేయించాలని కోరారు. వైస్‌చైర్మన్ గడ్డం శ్రీధర్, సభ్యులు నేల్ల బుచ్చన్న, బాషేట్టి గంగాధర్, శంకర్‌రెడ్డి, ముత్తన్న, రాజేశ్వర్, కొమ్ముల రాజేందర్ డిసివోను కలిసి నోటీసు అందజేసిన వారిలో ఉన్నారు.

'ప్రజాసంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి, జనవరి 3: ప్రజాసంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని, ప్రజల సౌలభ్యం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని గన్నారం గ్రామంలో బుధవారం కొనసాగుతున్న అభయహస్తం ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన నెలరోజుల్లోనే ఆరు గ్యారంటీలపై ప్రజల నుంచి దరఖాస్తులను సేకరిస్తుందని గ్రామాల్లో ఉన్న ప్రతీ నిరుపేదకు ప్రభుత్వ ఫలాలు అందేలా చూస్తామని అన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి పనులు చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంట మోహన్‌రెడ్డి, ఎంపీడీవో రాములు నాయక్, ఉపసర్పంచ్ బైరయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు మల్లేష్‌రెడ్డి, గోవర్ధన్, ఉన్నారు.

- ప్రభుత్వ పాఠశాలల విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే చెల్లించేలా చూస్తాం..

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే చెల్లించేలా సీఎంతో మాట్లాడుతానని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో పీఆర్‌టీయూ జిల్లా నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొద్దుటూరి మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, ఇల్తెపు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

- కాంగ్రెస్ పేదల పార్టీ..

మోపాల్: కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. ముదక్‌పల్లి గ్రామంలో జరిగిన ప్రజాపాలనలో ఆయనపాల్గొని మాట్లాడారు. పేద ప్రజలకు ఆరు గ్యాంటరీల పథకాన్ని అందించాలనే లక్ష్యంతోనే సీఎంగా ప్రమాణం చేసిన రోజే రేవంత్‌రెడ్డి మొదటి సంతకం పెట్టారని అన్నారు. మంచిప్ప ప్రాజెక్టు ద్వారా వచ్చే సాగునీరు కాల్వల ద్వారా అందిస్తామన్నారు. ముదక్‌పల్లి, గుడి తండా సర్పంచులు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే బీజేపీ కార్యకర్తలు, యు వకులు పార్టీలో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌కేత్ జిల్లా అధ్యక్షుడు ముప్పాగంగారెడ్డి, శేఖర్ గౌడ్, యాదగిరి, రవి,పార్టీ అధ్యక్షులు సాయరెడ్డి, గంగాప్రసాద్, కిరణ్, నాయకులు ఎన్నారు.

- విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే..

డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పాల్గొని స్వామి వారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆలయానికి తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, మాజీఎంపీపీ కంచెట్టి గంగాధర్, సర్పంచ్ శివారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

- ప్రజాపాలన పరిశీలన

మండలంలోని దూస్‌గాం గ్రామంలో ప్రజాపాలన సభను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పరిశీలించారు. లబ్ధిదారులు దరఖాస్తులు అందజేస్తున్న తీరును పరి శీలించి ప్రజల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అధికారులకు సూచించారు.



తయారు చేసిన కారుతో హమీద్

ఎలక్ట్రికల్ కారును తయారుచేసిన ఆర్మూర్ వాసి

పెర్కిట్, జనవరి 3: ఆర్మూర్ పట్టణానికి చెందిన దివ్యాంగుడైన హమీద్ అనుకున్నది సాధించాడు. తనకున్న ఆలోచనలను శోధించి సొంతంగా ఎలక్ట్రిక్ కారును తయారు చేశాడు. ఎలక్ట్రిక్ కారు తయారుచేయడంలో ఎన్నో ఇబ్బందులు ఎదురైనా సంవత్సరం పాటు శ్రమించి ఎలక్ట్రిక్ కారును తయారు చేశానని హమీద్ పేర్కొన్నాడు.

విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

నిజామాబాద్ అర్బన్, జనవరి3: అనుమతి లేకుండా, అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. ధర్పల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించే అబ్దుల్ ఖయ్యూమ్‌కి నోటీసు జారీ చేశారు. గత 1 జూలై 2022 నుంచి సదరు ఉపాధ్యాయుడు అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నాడని, ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చినా వివరణ ఇవ్వకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేశామని డీఈవో తెలిపారు. వారంలోపు వివరణ ఇవ్వని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

5న ఉద్యోగ మేళా

నిజామాబాద్ అర్బన్, జనవరి 3: నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కోసం ఈనెల 5న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వరుణ్ మోటార్స్ ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటీవ్/రిలేషన్‌షిప్ మేనేజర్/సర్వీస్ అడ్వైజర్/ఫ్రంట్ ఆఫీస్ ఉద్యోగాల కోసం ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ విద్యార్హత కలిగి డ్రైవింగ్ లైసెన్స్/డిప్లొమా/బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ కలిగి ఉండాలని 18 నుంచి 30 ఏళ్ల యువతీయువకులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9581768413, 9948748428 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు బయోడాటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫోటోలు, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.